'గ్రామోదయం'తో ప్రజా సమస్యలకు పరిష్కారం

కలెక్టర్ లోతేటి శివశంకర్

ఈపూరు : 'గ్రామోదయం'తో ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. గ్రామాల్లోని సమస్యల్ని ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని పరిష్కరించడం అధికారుల బాధ్యతని ఆయన తెలిపారు.మండలంలోని కొచ్చర్లలో గ్రామోదయం కార్యక్రమంలో భాగంగా అయన శుక్రవారం ఉదయం 8గంటలకే గ్రామానికి చేరుకొని, ఎస్సీ కాలనీలో పర్యటించారు. కాలనీలో పారిశుద్ధ్యంతో పాటు సైడ్ డ్రెయిన్లను పరిశీలించారు. గ్రామం నడి సెంటర్‌లో చెత్త దిబ్బను వెంటనే తొలగించాలని అధికారుల్ని ఆదేశించారు. దారిన కొందరు వెళ్లనివ్వడం లేదని నివాసితులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సమస్యల్ని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పలువురు చిన్నారులతో ముచ్చటించారు. చిన్నారులకు, మహిళలకు రక్తం తక్కువగా ఉండటంతో హీమోగ్లోబిన్ పరీక్షలు అక్కడిక్కడే జరిపించారు. రక్తం పెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యల్ని డాక్టర్ నాగేంద్రబాబుతో చర్చించారు. గ్రామంలో చెరువులు ఉన్నప్పటికీ మంచినీటి సమస్య ఉందని పలువురు తెలపడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడారు. వచ్చే సీజన్ నాటికి మంచినీరు సమృద్ధిగా అందేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. సెలవు అయినప్పటికీ అక్కడ కొందరు విద్యార్థులు ఉండటంతో వారు ఏ విధంగా చదువుతున్నారో గమనించారు. వారితో చదివించి, కథలు చెప్పించారు. పాఠశాల ఆవరణ మొత్తం చదును చేసి సక్రమంగా చేయాలని విద్యాశాఖ అధికారుల్ని ఆదేశించారు. అనంతరం కాలనీ మొత్తం పర్యటించారు. చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించి అక్కడ అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ఎక్కడా చెత్త ఉండకూడదని, తడి, పొడి చెత్త వేరువేరుగా తీసుకొచ్చి ఇక్కడ వేసే విధంగా చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌ని ఆదేశించారు. పెళ్లిళ్ల సీజన్‌లో విందుల అనంతరం తిన్న పదార్థాలు, విస్తరాకులు వేసే వారిపై పంచాయతీ తీర్మానం చేసి జరిమానా విధించాలని అధికారుల్ని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ శివశంకర్ విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లోని సమస్యల్ని తెలుసుకొని తక్షణమే వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టేందుకే గ్రామోదయం నిర్వహిస్తున్నామని వివరించారు. కొచ్చర్ల గ్రామస్తుల సమస్యల్ని తక్షణమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశామని పేర్కొన్నారు. అధికారులు కూడా సమన్వయంతో పని చేస్తూ, సమస్యల్ని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ దేవరాజ్, మండల ప్రత్యేకాధికారి వరలక్ష్మి, తహసీల్దార్ వెంకటేశ్వర్లునాయక్, ఎంపీడీవో ఉషాకిరణ్ , పలువురు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.



కొచ్చర్లలో సైడ్ డ్రెయిన్లను పరిశీలిస్తున్న కలెక్టర్

యడ్లపాడులో..

మండలంలోని మైదవోలులో శుక్రవారం గ్రామోదయం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి, జిల్లా డీఎల్‌డీవో వెంకటరెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన మండలస్థాయి అధికారుల బృందం పాల్గొంది. ముందుగా గ్రామంలో రక్తహీనతతో బాధపడే నలుగురు తల్లులు, వయస్సుకు తగ్గ ఎత్తుపెరగని ముగ్గురు పిల్లల ఇళ్లకు వెళ్లి వివరాల్ని తెలుసుకున్నారు. పౌష్టికాహారం తీసుకోవాల్సిన అంశాలపై వారికి అవగాహన కల్పించారు. స్థానిక ఎంపీపీఎస్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్ని సందర్శించారు. వేసవి శిక్షణ కార్యక్రమం, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు కేంద్రం నుంచి అందించే పథకాల గురించి ఆరా తీశారు.

- మండల ప్రాథమిక వైద్యశాల ఆధ్వర్యంలో గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల్ని అందించారు. కార్యక్రమంలో భాగంగా 62 మందికి బీపీ, షుగర్ ఇతరత్రా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.
- మైదవోలు -లింగారావుపాలెం మధ్యలో డొంక మార్గంలో ఉపాధి హామీ పథకం ద్వారా కాలువ పనులు నిర్వహిస్తున్న కూలీల్ని కలసి మాట్లాడారు. పనులు నిర్వహణ, సమస్యల గురించి ఆరా తీశారు.
- చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని చేరుకుని పారిశుద్ధ్య కార్మికుల్ని కలిశారు. ఇళ్ల నుంచి తీసుకువస్తున్న వ్యర్థాల నుంచి తడిపొడి చెత్తల్ని వేరు చేయడం వాటినుంచి వర్మికంపోస్టు ఉత్పత్తి, రైతులకు విక్రయించడం వంటి అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. చివరిగా క్లాప్‌మిత్రల సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామోదయంలో గుర్తించిన అంశాలపై యడ్లపాడు మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి సమీక్షల్ని నిర్వహించారు. వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖలు కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి గోపీనాయక్, పీఆర్ డీఈఈ శ్రీనివాస్, ఎంపీడీవో వై. హనుమారెడ్డి, ఏవో సాయి శ్రీనివాస్, హెచ్‌ఎం జీవీ హేమలత, అంగన్‌వాడీ, ఆరోగ్య, ఆషా కార్యకర్తలు గ్రామస్థాయి అధికారులు, గ్రామ పెద్ద గొరు హనుమంతరావు పాల్గొన్నారు.

నాదెండ్లలో...

ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని మండల ప్రత్యేకాధికారి బీజే బెన్ని చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్లలో శుక్రవారం గ్రామోదయం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామంలో పర్యటించి పరిసరాల పరిశుభ్రత, మురుగుకాల్వల నిర్వహణ పరిశీలించారు. స్థానిక అధికారులతో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. గర్భిణులు, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, రక్తహీనత వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకం పనులు పరిశీలించి, సిబ్బందితో సమీక్షించారు. ప్రాథమిక పాఠశాలలో ఐ లవ్ రీడింగ్ కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులతో ముచ్చటించారు. గ్రామంలో ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించారు. పారిశుద్ధ్య కార్మికులతో మమేకమై కాఫీ విత్ క్లాప్ మిత్రా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్, సీడీపీవో శాంతకుమారి, ఎంఈవో ఆంజనేయులు, వైద్యాధికారి సాయిశ్వేత, ఏపీఎం భరత్, ఏపీవో పుష్పరాజు, హౌసింగ్ ఏఈ రామకృష్ణనాయక్, పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

శావల్యాపురంలో..

మండలంలోని చినకంచర్లలో గ్రామోదయం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి లోతేటి వరలక్ష్మి, ఎంపీడీవో పేరు మీనా సీతారామయ్య తదితరులు గ్రామంలో పర్యటించారు. ప్రభుత్వ పథకాల అమలు, సచివాలయ ఉద్యోగులు పనితీరు గురించి గ్రామస్తుల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో అంగన్‌వాడీ సెంటరు సందర్శించారు. గర్భిణులు, బాలింతలు చిన్నారులకు అందుతున్న సేవల్ని అడిగి తెలుసుకున్నారు. రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన ఆరోగ్య సూత్రాల్ని వివరించారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని , ఉపాధి పనుల్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ పురేటి నాగేశ్వరరావు, మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం, ఏంఈవో మద్దికుంట సాంబశివరావు, ఈవోపీఆర్డీ పి.సుగుణ, ఐసీడీఎస్ సూపర్‌వైజరు గుర్రం శేషకుమారి, కార్యదర్శి చింతా శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో..

మండలంలోని ఘాటి తండాలో శుక్రవారం గ్రామోదం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి ఎస్.ఓబులునాయుడు, ఇన్‌చార్జి ఎంపీడీవో టి.పార్వతి, పలు శాఖల మండలస్థాయి అధికారులు తండాను సందర్శించారు. రక్తహీనతను ఎదుర్కొంటున్న ముగ్గురు బాలికల్ని గుర్తించి నివారణకు తగు సూచనలు చేశారు. అంగన్‌వాడీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి అందుతున్న సదుపాయాల్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు చదువుపై శ్రద్ధ కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఆయుష్మాన్ భారత్, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు తదితర సర్వేలను పరిశీలించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నాదెండ్లలో సమస్యలపై స్థానికులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి బెన్ని, అధికారులు



చినకంచర్లలో ఫ్యామిలీ డాక్టర్ సేవల్ని పరిశీలిస్తున్న అధికారులు



మాచవరంలో గ్రీన్ అంబాసిడర్లను సన్మానిస్తున్న అధికారులు

రొంపిచర్లలో..

మండలంలో మాచవరంలో శుక్రవారం గ్రామోదయం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు, ఎంపీపీవో కె.మ్యాథ్యూబాబు ఆధ్వర్యంలో అధికారులు గ్రామంలో పర్యటించారు. గ్రామస్తుల సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న గ్రీన్ అంబాసిడర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వి.రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మురళీధర్, గ్రామ పెద్దలు బి. కోటిరెడ్డి, కె. వెంకటేశ్వరరెడ్డి, మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మోడల్ పాఠశాలలో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నాదెండ్ల: చిరుమామిళ్ల ఏపీ మోడల్ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి ఇంటర్‌లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఝాన్సీవాణి తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈనెల 22 నుండి జూన్ 7 వరకూ దరఖాస్తు చేసుకుని వాటి ప్రతుల్ని నేరుగా పాఠశాలలో గానీ ఎంఈవోకు గానీ అందించాలని సూచించారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో సీట్లు ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.150, ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.200 ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో చదివి ఉత్తీర్ణులైన వారికి మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు.

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం ఆదర్శ పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోరే విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బి.రవినాయక్ శుక్రవారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూప్‌లకు ఈ నెల 22 నుంచి జూన్ 3 వరకు సమయం ఉందని పేర్కొన్నారు. వివరాలకు మండల విద్యాశాఖ అధికారిని గానీ, ప్రిన్సిపాల్‌ను గానీ సంప్రదించాలని సూచించారు.

మట్కా నిర్వాహకుడి అరెస్టు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలో మట్కా నిర్వహిస్తున్న వ్యక్తిని వినుకొండ ఎస్ఈబీ అధికారులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. నరసరావుపేట డీఎస్ఈవో ఆదేశాల మేరకు వినుకొండ సెబ్ అధికారులు పట్టణంలోని మార్కాపురం రోడ్డులోని చెక్‌పోస్టు వద్ద దాడులు నిర్వహించారు. మట్కా నిర్వాహకుడు రోళ్ల రమేష్‌ను అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి రూ. 4540 స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం వినుకొండ పోలీసులకు అప్పగించారు. కార్యక్రమంలో సెబ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సేవారత్నకు ఐదుగురు వలంటీర్ల ఎంపిక

నాదెండ్ల: మండలంలో ఐదుగురు వలంటీర్లు సేవారత్న అవార్డులకు ఎంపికయ్యారు. సాతులూరు-1 సచివాలయంలో మసీదు మూసా, సాతులూరు-2 సచివాలయంలో కాటినేడి నరేంద్ర, తూబాడు సచివాలయంలో నూతక్కి అనిల్, కనపర్రు సచివాలయంలో చెవుల నరేంద్ర, గొరిజవోలు సచివాలయంలో ధారెడ్డి సీతమ్మ ఎంపికైనట్లు ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ తెలిపారు. వీరిని రూ.20 వేలతో పాటు మెడల్, శాలువాతో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు.

అటవీ సంరక్షణలో భాగస్వాములు కావాలి

ఈపూరు: మండలంలోని ఎర్రగుంట తండాలో అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణహిత జీవన శైలిలో భాగంగా అడవుల సంరక్షణపై శుక్రవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అటవీ సంరక్షణలో భాగస్వామ్యులు కావాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈపూరు సర్పంచ్ పల్లమీసాల చెంచయ్య, పంచాయతీ కార్యదర్శి రమేష్, అటవీశాఖ అధికారులు టి. రామకృష్ణ, ఆర్.లక్ష్మణ్‌నాయక్, ఎస్. వెంకటేశ్వర్లు, వన సంరక్షణ సమితి చైర్మన్ ఆర్. రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

మట్టి దిబ్బలు పడి వ్యక్తి దుర్మరణం

వినుకొండ(నూజెండ్ల) : వినుకొండ రూరల్ మండలం చీకటీగలపాలెంలో మట్టి దిబ్బలు పడి వ్యక్తి మృతి చెందాడు. సేకరించిన వివరాల ప్రకారం.. వినుకొండ పట్టణం శృంగారపువనానికి చెందిన కావలకుంట అంజి (45) పుట్ట మట్టి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. వృత్తిలో భాగంగా వినుకొండ మండలం చీకటీగలపాలెం రైల్వేస్టేషన్ సమీపంలో పెద్దఎత్తున ఉన్న పుట్టమట్టిని సేకరిస్తున్న క్రమంలో పైనుంచి దిబ్బలు ఒక్కసారిగా తలపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

రొంపిచర్ల : మండలంలో వీరవట్నం గ్రామానికి చెందిన కొయ్యలపూడి చిన్నరోశయ్య కొద్ది రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడి కుటుంబ సభ్యుల్ని శుక్రవారం గ్రామ సర్పంచ్ మానుకొండ వాసుదేవరెడ్డి పరామర్శించారు. వైఎస్సార్ బీమా యోజన కింద మృతుడి భార్య సౌజన్యకు రూ.10,000 ఆర్థిక సాయం అందజేశారు.

నీతి, నిజాయతీకి నిలువెత్తు నిదర్శనం సుందరయ్య

నరసరావుపేట: నిలువెల్లా నిరాడంబరత, ఎంతటివారినైనా ప్రశ్నించడంతో పాటు నీతి, నిజాయతీకి నిదర్శనం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పుచ్చలపల్లి 38వ వర్ధంతి సభకు సీపీఎం సీనియర్ నాయకుడు ఏ.వి.కె. దుర్గారావు అధ్యక్షత వహించారు. పుచ్చలపల్లి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

నేటి నుంచి మేరా లైఫ్.. మేరా స్వచ్ఛ నగర్

- ఇళ్లల్లోని పాత వస్తువులను ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లకు అందజేయండి
- పట్టణ ప్రజలను కోరిన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

నరసరావుపేట: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పురపాలక సంఘంలో శనివారం నుంచి జూన్ ఐదో తేదీ వరకు మేరా లైఫ్.. మేరా స్వచ్ఛనగర్‌లో భాగంగా రెడ్యూస్ రీసైకిల్, రీయూజ్ (ఆర్‌ఆర్‌ఆర్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ఓ.శ్రీనివాసరావు పేర్కొన్నారు. తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పట్టణంలోని ఐదు ప్రదేశాలైన గుంటూరు రోడ్డులోని వర్మి కంపోస్టు, పెద్దచెరువులోని ఏడవ లైను, వినుకొండరోడ్డు మాతాశ్రీ హాస్పిటల్ వెనుక వైపున, రైల్వేస్టేషన్‌రోడ్డులోని రైల్వే మొదటిగేటు, బరంపేట కరెంట్ ఆఫీస్ వద్ద ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న దుస్తులు, బూట్లు, చెప్పులు, టోపీలు, పరుపులు, బెడ్ షీట్లు, దుప్పట్లు, పుస్తకాలు, బ్యాగ్‌లు, పిల్లలు ఆడుకునే బొమ్మలు, సైకిళ్లు, చెక్క, ఇనుప కుర్చీలు, టేబుల్స్, చెక్క మంచాలు, ఇనుప మంచాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, తదితర వస్తువులను ఈ సెంటర్‌కు అందిస్తే, వారు వాటి అవసరం ఉన్న ఇతరులకు వాటిని అందజేస్తారని తెలిపారు. ఈ సెంటర్‌కు నిరుపయోగంగా ఉన్న వస్తువులు ఇవ్వదలచిన వారు తమ ఏరియాలోని శానిటేషన్, పర్యావరణ సెక్రటరీకి సమాచారం ఇవ్వాలని సూచించారు.



వార్డులో డ్రెయిన్ల శుభ్రం పనులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్

వారు ఆయా వస్తువులను ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌కు తరలిస్తారని తెలిపారు. మనకు పనికి రాకుండా ఉండి, ఇతరులకు ఉపయోగపడే వస్తువుల్ని వారికి అందించి సహాయపడే విధంగా అవకాశం కల్పిస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సేవలకు పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణలో అశ్రద్ధ వద్దు

తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజలకు సమస్యలు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ఓలేటి శ్రీనివాసరావు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఆయన శుక్రవారం నగరోదయంలో భాగంగా పట్టణంలోని 11వ వార్డులో పర్యటించారు. వార్డులో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా సమస్యలపై స్థానికులతో మాట్లాడి తెలుసుకున్నారు. సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. డ్రెయిన్లలో పూడికతీత పనుల్ని పరిశీలించారు. వార్డులో సమస్యలపై ఇన్‌చార్జి సానికొమ్ము రమణారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామకోటయ్య, సచివాల సెక్రటరీలు, వలంటీర్లుతో చర్చించారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా వ్యవహరించాలని సూచించారు.

శ్రీ దత్తా హాస్పిటల్‌లో అత్యంత అరుదైన ఆపరేషన్

నరసరావుపేట: కిడ్నీలో రాళ్ల సమస్యతో కొంత కాలంగా బాధపడుతున్న ఒక మహిళకు పట్టణంలోని శ్రీ దత్తా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అత్యంత అరుదైన ఆపరేషన్‌ను నిర్వహించి యూరాలజీ వైద్యులు శభాష్ అనిపించుకున్నారు. ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను శుక్రవారం హాస్పిటల్ యూరాలజిస్ట్, సర్జన్ డాక్టర్ అన్నా మణికంఠ సురేష్ వెల్లడించారు. మాచర్లకు సమీపంలోని 40ఏళ్ల షేక్ ఖాసింబీ ఎడమ వైపు నడుము నొప్పితో చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కి వచ్చారన్నారు. పరీక్షలు నిర్వహించగా ఎడమ వైపు కిడ్నీలో 2.5 సెంటీమీటర్ల రాయి ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆ మహిళకు రక్తంలో 80 శాతం ఆక్సిజన్ మాత్రమే ఉందని, ఊపిరితిత్తుల జబ్బు (సీవోపీడీ), పెరిఫరల్ సైనోసిస్ (నీలి వర్ణం చెందడం) సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఆమెకు అధునాతన పద్ధతిలో ఇప్పుడిప్పుడే పెద్ద పెద్ద నగరాల్లో మాత్రమే చేసే విధంగా వెల్లకిలా పడుకోబెట్టి పూర్తిగా ఎండోస్కోపీ పద్ధతితో కిడ్నీలో రాయిని తొలగించినట్లు వివరించారు. పేషెంట్ పూర్తి ఆరోగ్యంగా ఉందని తెలిపారు. ఆపరేషన్ చేసేందుకు తమ వైద్య బృందానికి సహకరించిన హాస్పిటల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్, ఇతర వైద్య బృందం డాక్టర్ ఎస్. వేణుగోపాలరావు, డాక్టర్ పి.మహేశ్వరరావు, డాక్టర్ సుబ్బారావుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.



ఆపరేషన్ చేసిన వైద్యులు, రోగితో హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ కృష్ణకాంత్

'స్వచ్ఛ వినుకొండ' సాధనే లక్ష్యం

వినుకొండ(నూజెండ్ల): 'స్వచ్ఛ వినుకొండ' సాధనకు కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులు తెలిపారు. స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో శుక్రవారం మేరా లైఫ్, మేరా స్వచ్ఛత కార్యక్రమంపై స్వయం సహాయక సంఘాలు, వలంటీర్లు, పారిశుద్ధ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ప్రజలకు అవగాహన కల్పించి, అడ్డుకట్ట వేయడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌తో పాటు పట్టణంలో పారిశుద్ధ్య చర్యలపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. తడిచెత్త, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు

స్నేహితుడి వైద్య పరీక్షలకు ఆర్థిక సాయం

నరసరావుపేట ఈస్ట్: తమతో పాటు కళాశాలలో విద్యనభ్యసించిన సహచర విద్యార్థి వైద్య పరీక్షలకు మిత్రులు రూ.33వేలు ఆర్థిక సహాయం అందించారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో 1989-92 విద్యా సంవత్సరంలో బీఏ చదివిన పి.శ్రీనివాసరాజు తనకు తలలో నరాలు దెబ్బతిని పక్షవాతం వచ్చిందని, వైద్య పరీక్షలకు ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉందని అప్పటి మిత్రులకు తెలియజేశారు. వారు స్పందించి రూ.33వేలు సమకూర్చి శ్రీనివాసరాజు భార్య రోజాకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో కర్నాటి కృష్ణమూర్తి, నరమాల ఏడుకొండలు, తొగటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మిత్రుని భార్యకు ఆర్థిక సహాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

దోమల ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి

నాదెండ్ల: పరిసరాల్లో తేమ వాతావరణం దోమల వ్యాప్తికి కారణమవుతుందని జిల్లా మలేరియా అధికారి కె. రవీంద్ర రత్నాకర్ తెలిపారు. గణపవరం పీహెచ్‌సీ పరిధిలో ఫ్రైడే - డ్రైడే నిర్వహించారు. వైద్యాధికారి ఎల్. ప్రసాద్‌నాయక్ వైద్య సిబ్బందితో కలసి పలు కాలనీల్లో పర్యటించారు. ప్రజారోగ్యంపై మాట్లాడారు. దోమ కాటుతో ప్రాణాంతక డెంగీ, మలేరియా లాంటి వ్యాధులు ప్రబలుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. పరిసరాల పరిశుభ్రత, కాల్వలు, ఖాళీ ప్రదేశాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. మూతలు లేని వాటర్ ట్యాంకులు, తొట్లు, కుండీలలో దోమలు గుడ్లు పెట్టి సంతతిని వ్యాప్తి చేస్తాయని, నీరు నిల్వ లేకుండా ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని సూచించారు. అనంతరం స్థానికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది షేక్ అజీజ్, చలమారెడ్డి, శివయ్య, పద్మావతి, జిలాని, కోటేశ్వరరావు, మేరికుమారి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



కరపత్రాలు అందిస్తున్న మలేరియా అధికారి రత్నాకర్

గ్రామస్తుల సమస్యలకు త్వరలో పరిష్కారం

పల్లెనిద్రలో అధికారుల హామీ

వినుకొండ(నూజెండ్ల): పల్లెనిద్రలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల్ని త్వరలోనే పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నూజెండ్ల మండలం పుచ్చనూతల పంచాయతీ పరిధిలోని రవ్వవరంలో మండల స్పెషల్ ఆఫీసర్ రవిబాబు, ఎంపీడీవో షేక్ జిలానీ బాషాలు గురువారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం శుక్రవారం తెల్లవారుజామున గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటించారు. ప్రజల నుంచి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ రవిబాబు మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అన్ని శాఖల సిబ్బందితో సమీక్ష నిర్వహించి గ్రామ ప్రజల సమస్యల్ని త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామంలో కరెంటు, పారిశుద్ధ్య సమస్యల్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మండల స్పెషల్ ఆఫీసర్ రవిబాబు, ఎంపీడీవో జిలానీ బాషా

'చుక్కల' నుంచి 740 మంది రైతులకు విముక్తి

శావల్యాపురం: మండలంలోని ఏడు గ్రామాల్లోని 740 మంది రైతులకు చెందిన 831.27 ఎకరాల చుక్కల భూములకు నుంచి విముక్తి లభించినట్లు తహసీల్దారు షేక్ జాన్‌సైదులు తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కనమర్లపూడిలో 67 మంది రైతులకు 65.98 ఎకరాలు, కొత్తలూరులో 83 రైతులకు 103.68, కారుమంచిలో 129 మంది రైతులకు 130.28, వేల్పూరులో 22మంది రైతులకు 13.045, పిచికలపాలెంలో 215 మంది రైతులకు 281 ఎకరాలు, శానంపూడిలో 113 మంది రైతులకు 130.825, పొట్లూరులో 111 మంది రైతులకు 106.46 ఎకరాలు విముక్తి లభించినట్లు చెప్పారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, డెప్యూటీ సర్వేయర్ తుంగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

24న యడ్లపాడు మండల పరిషత్ సమావేశం

యడ్లపాడు: స్థానిక మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశాన్ని ఈనెల 24న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వై. హనుమారెడ్డి తెలిపారు. ఎంపీపీ పిడతల ఝాన్సీ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, సభ్యులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు ప్రకాశం పంతులు వర్ధంతి

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 66వ వర్ధంతిని శనివారం ప్రకాష్‌నగర్‌లోని ఆయన విగ్రహం వద్ద నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, ప్రకాశం అభిమానులు హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

ఖరీఫ్ సాగుకు భూముల్ని సిద్ధం చేసుకోవాలి



వినుకొండ(నూజెండ్ల) : రైతులంతా ఖరీఫ్ సాగుకు సమాయత్తం అయ్యే సమయం ఆసన్నమైందని, పంటలు వేసుకునేందుకు భూముల్ని సిద్ధంగా ఉంచుకోవాలని ఏడీఏ బి.రవిబాబు సూచించారు. మండలంలోని వి.అప్పాపురం, జంగాలపల్లి గ్రామాల రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్ సాగుకు సమాయత్తంపై రైతులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఆర్బీకేల ద్వారా పొందాలని సూచించారు. పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీపై అందజేస్తున్నట్లు వివరించారు. కౌలు రైతులంతా సీసీఆర్‌సీ కార్డులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో జిలానీబాషా, ఈవోపీఆర్‌డీ ప్రసాద్‌బాబు, ఏఈవో ఎలీషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యడ్లపాడులో...

యడ్లపాడు రైతుభరోసా కేంద్రంలో శుక్రవారం ఖరీఫ్ సీజన్ - సాగుకు సమాయత్తం కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సాగుపై పలు అంశాల గురించి ఏవో సీహెచ్. సరిత రైతులకు వివరించారు. కౌలు రైతు కార్డులు పొందగోరేవారు భూ యజమాని పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, కౌలుదారుని ఆధార్ కార్డు నకళ్లను దరఖాస్తును జతచేసి గ్రామ వీఆర్వోకు అందజేయాలని సూచించారు. సమీపంలోని రైతు భరోసా కేంద్రంలోనూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాల్ని ఆర్‌బీకేల్లో 50శాతం సబ్సిడీపై అందజేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ కె. హేమ, కార్యదర్శి శశికళ, వీఆర్వో మధుసూదనరావు, వీఏఏ సుప్రియ, సెరికల్చర్ అసిస్టెంట్ రామ్మోహన్‌రావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.